క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



ఆర్టీసీ సిబ్బందితో కలిసి నాయకుల సంబరాలు

పెగడపల్లి:ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడాన్ని హర్షిస్తూ ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరిపారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నంచర్ల విండో మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందించిన మిత్రులు

ధర్మపురి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తమ మిత్రుడు నర్మల రాజశేఖర్ కుటుంబానికి రూ.55 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి తమ స్నేహ భావాన్ని చాటుకున్నారు. ధర్మపురికి చెందిన రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. 2005–2007 విద్యా సంవత్సరం అగ్రికల్చర్ డిప్లమా మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి మిత్రబృందం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నర్మల నరేశ్, మద్ది నరేశ్, వేముల కార్తీక్, మద్ది మహేశ్‌బాబు, అశోక్, రవిచంద్ర రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..



నిత్యావసర సరుకులు అందిస్తున్న నాయకులు

మేడిపల్లి: భీమారం మండలం పసునూర్ గ్రామానికి చెందిన తోకల లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఆది శ్రీనివాస్ యువసేన నాయకులు ఆదివారం ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు దృష్టికి తీసుకెళ్లగా, లక్ష్మి కూతురికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భీమారం మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పోతని విజయ, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీ ప్రారంభిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

కథలాపూర్: మండలంలోని దుంపేటలో బాలరాజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నీని ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. యువత తీరిక వేళల్లో క్రీడలపై దృష్టి సారించాలని ఎస్సై సూచించారు. టోర్నీలో 16 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. తొలి మ్యాచ్‌లో గంభీర్‌పూర్, అంబారిపేట జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్యాల రమేశ్, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కథలాపూర్: మండల కేంద్రం శివారులో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన గుగ్లోత్ సంజీవ్ కోరుట్ల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అదే రోడ్డులో ముందు వెళ్తున్న కారును ఢీకొట్టి పడిపోయారు. సంఘటన స్థలానికి ఎస్సై నవీన్‌కుమార్ చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రుడిని కోరుట్లలోని ఆస్పత్రికి తరలించారు.

ఆదమరిస్తే అంతే సంగతి

- ప్రమాదకరంగా ఇందిరాగాంధీ చౌరస్తా
- స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు కరువు
- వాహనదారుల ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



తరచూ ప్రమాదాలు జరుగుతున్న ఇందిరాగాంధీ చౌరస్తా

ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించిన అధికారులు ప్రధాన కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి రావడానికి జాతీయ రహదారి నుంచి సింగిల్ రోడ్డును 15 ఏళ్ల క్రితం డబుల్ రోడ్డుగా మార్చారు. దీంతో వాహనాలు అతివేగంగా వస్తూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద నాలుగు గ్రామాలకు వెళ్లే రోడ్డును డబుల్ రోడ్డుగా చేశారు. ఈ చౌరస్తా నుంచి మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం వస్తుండగా ఇబ్రహీంపట్నం నుంచి గోదూర్ మీదుగా నిర్మల్ జిల్లాకు, ఖానాపూర్‌కు ఇబ్రహీంపట్నం నుంచి మూలరాంపూర్, ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండ మీదుగా నిర్మల్ జిల్లాకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. నిర్మల్ జిల్లా మీదుగా మహారాష్ట్ర జిల్లాలకు తక్కువ దూరం అవుతున్నందునా అనేక వాహనాలు నడుస్తుంటాయి. ఇబ్రహీంపట్నం ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ఏలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు అతివేగంగా వస్తూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం గోదూర్ వైపు నుంచి బైంసాకు వెళ్తున్న ఓ కారు బైకును ఢీ కొట్టడంతో ఓ మహిళతో పాటు యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఏడాది క్రితం కోమటి కోండాపూర్‌కు చెందిన దంపతులు బైక్‌పై వెళ్తుండగా అతివేగంగా కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ చౌరస్తా గుండా నిత్యం బైక్‌లతో పాటు భారీ వాహనాలు అతివేగంగా వెళ్తుండడంతో వాహనాలు అడ్డుగా రావడం వలన అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి.

హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకనే ప్రమాదాలు

ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద నాలుగు గ్రామాలకు వెళ్లే రోడ్లు ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఇక్కడ ఏలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల చౌరస్తాగా మారింది. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు

చౌరస్తా వద్ద వేగంగా వాహనాలు వెళ్తూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులకు పలుసార్లు మండల ప్రజలు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద వాహనాలు అతివేగంగా వస్తున్నాయి. దీని వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– సాయిరాం గౌడ్, ఇబ్రహీంపట్నం

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి



చౌరస్తా వద్దనే మా షాపు ఉంది. నిత్యం వాహనాలు వేగంగా వెళ్లడం వలన అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు చౌరస్తా వద్ద ప్రమాదాలు జరగకుండా, వాహనాలు వేగంగా వెళ్లకుండా సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు అమర్చాలి.

– కొడిమ్యాల దీపక్‌రాజ్, ఇబ్రహీంపట్నం

నెల రోజుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం



ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద నాలుగు దారులకు నెల రోజుల్లో ప్రమాదాలు జరుగకుండా రంబుల్ స్ట్రిప్‌లు ఏర్పాటు చేస్తాం. ఉన్నతాధికారుల సహకారంతో ఇరువైపులా రోడ్లకు ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తాం.

– వేణు, ఆర్‌అండ్‌బీ, ఏఈ, మెట్‌పల్లి

సాగునీటి ఎద్దడికి పరిష్కారం చూపిస్తాం

- ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

గొల్లపల్లి: ఎస్సారెస్పీలో నీటిమట్టం తక్కువగా ఉండటం వల్ల రైతులకు సాగునీరు అందించే విషయంలో కొంత సమస్య ఏర్పడుతోందని, ఈ విషయంపై సీఎం తో మాట్లాడినట్లు ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లిలో ఆదివారం 119 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసి మాట్లాడారు. సాగు నీరు అందించే విషయంలో ఏర్పడుతున్న సమస్యను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలోని లొత్తునూర్ గ్రామంలోని శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, స్పెషల్ ఆఫీసర్ సాయిబాబా, ఎంపీపీ శంకర్,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు నిషాంత్ రెడ్డి, శైలేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్: మండలంలోని కొత్తపేట శ్రీరాజరాజేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దానవేణి రాంలు, పాలకమండలి సభ్యులు మండ జల, బోదాసురాజన్న, నర్సయ్య, ఏనుగు నాగిరెడ్డి, ముక్కెర ముత్యం, బోంగొని భూమాగౌడ్, ఈవో విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్ట రాజేశ్వరస్వామి ఆదాయం రూ.2.41 లక్షలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గుట్ట రాజేశ్వరస్వామివారి ఆదాయం రూ. 2.41 లక్షలు సమకూరింది. ఆదివారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం హుండీ లెక్కించారు.

సన్మానం

పెగడపల్లి: మండలంలో పద్మశాలీ సామాజికి వర్గానికి చెంది ఉద్యోగాలు సాధించిన పలువురు ప్రతిభావంతులను బతికపల్లి గ్రామశాఖ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన వల్లాల మమత, ఎలగొండ గంగజల, కొమాకుల రాజు, పెంట వినయ్, నల్ల సౌమ్య, సామల వరలక్ష్మి ఇటీవల ఉద్యోగాలు సాధించడంతో వారిని పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ సాధనకు పేదరికి అడ్డుకాదని, నిరుద్యోగ యువత పట్టుదలతో శ్రమిస్తే విజయం మీవెంటే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవాసంఘం మండల పద్మశాలీ సేవా సంఘం మండల అధ్యక్షుడు గంగ మల్లేశం, గ్రామశాఖ అధ్యక్షుడు జుంజురు రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద ఆదివారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. ఏలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మెట్‌పల్లిరూరల్: గల్ఫ్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ప్రవాసిమిత్ర లేబర్ యూనియన్ యూఏఈ అధ్యక్షుడు బత్తిని రాజగౌడ్ అన్నారు. శాసనసభ ఎన్నికల మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ కోసం హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి ఎన్నో రోజులవుతున్నా వాటి ఊసే ఎత్తడంలేదన్నారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు, మరణించిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గల్ఫ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు, తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్న ఎంతో మంది ఎన్నో సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

రైస్‌మిల్ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అన్వర్

కోరుట్ల: రైస్‌మిల్ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కౌన్సిలర్ ఎండీ.అన్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం అసోసియేషన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా ఖలీల్, కోశాధికారిగా రఫీలను ఎన్నుకున్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మహర్షి

మెట్‌పల్లి: అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వీబీ మహర్షిని ఎన్నుకున్నారు. పట్టణంలోని నిఖిల్ భరత్ హైస్కూల్‌లో ఆదివారం అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా మహర్షిని, ముఖ్య సలహాదారుగా ఆల్‌రౌండర్ గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎస్ శ్రీలత, ఏ భవాని, ఎం బానేసేలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మహర్షి మాట్లాడుతూ జిల్లా క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారమందిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా చరణ్

కోరుట్ల: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉరుమడ్ల చరణ్ నియమితులయ్యాడు. ఈ మేరకు బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ ఆదివారం నియామక పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ ధర్మపురి అరవింద్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ రావు, సుఖేందర్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు,నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వారికి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తోందని, త్వరలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కార్యక్రమం చేపడుతామన్నారు. రైతులందరికీ త్వరలోనే రుణమాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మెరుగు రమ్య, మునీందర్‌రెడ్డి, నాయకులు ధర్మయ్య, మారు గంగారెడ్డి, జున్ను రాజేందర్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారం తగదు

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ సందర్భంగా కలిగిన విద్యుత్ అంతరాయాన్ని విద్యుత్ కొరతగా సృష్టిస్తూ ఓ మీడియా సంస్థ అసత్య ప్రచారం చేయడాన్ని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. ప్రతి రెండో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు, లైన్ క్లియరెన్స్ పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, దీనిపై తాను విద్యుత్ శాఖ అధికారులను ఆరా తీస్తే ఆ సంభాషణను సదరు మీడియా అసత్య ప్రచారం చేసిందని పేర్కొన్నారు.

వాల్మీకి ఆవాసం అభివృద్ధికి కృషి

జగిత్యాలటౌన్: వాల్మీకి ఆవాసం అభివృద్ధికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదివారం సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆవాసం నూతన భవన నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు జీవన్‌రెడ్డి ప్రకటించారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్సీకి ఫిర్యాదు

సారంగాపూర్: దుబ్బరాజన్న జాతరలో అధికారుల తీరుపై జర్నలిస్టులు ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యం



వేంపేటలో జీరో బిల్లు అందిస్తున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం వేంపేటలో ఆదివారం గృహజ్యోతి పథకాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించి పలువురు లబ్ధిదారులకు జీరో బిల్లు రశీదులు అందజేశారు. ఆరు గ్యారెంటీ పథకాలను ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందని, ఎలాంటి సందేహం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, శంకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, లైన్‌మెన్ వినోద్, జూనియర్ లైన్‌మెన్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకంతో పేదలకు లబ్ధి

మల్లాపూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీటీసీ మామిడి మంజుల, మాజీ సర్పంచ్ సాయికుమార్ అన్నారు. మండలంలోని గుండంపల్లి, చిట్టాపూర్ గ్రామాల్లో ఆదివారం గృహజ్యోతి పథకాన్ని ట్రాన్స్‌కో అధికారులతో కలిసి లబ్ధిదారుల ఇంట్లో మీటర్ రీడింగ్ తీసి వారికి జీరో బిల్లు అందజేశారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మామిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు నాసం తిరుపతి, ఎల్లాల రాకేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో గృహలక్ష్మీ పథకం కింద ఉచిత జీరో బిల్లును ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్ ఆదివారం ఓ ఇంటి యాజమానికి అందజేశారు. కార్యక్రమంలో కొమటికొండాపూర్ ఎంపీటీసీ జైలేశ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూదిగం గంగాధర్, గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

సమాచారం..

మెట్‌పల్లిలో నేడు మెగా జాబ్ మేళా

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆదివారం తెలిపారు. ఈ మేళాలో హైదరాబాద్‌కు చెందిన పలు కంపెనీలు పాల్గొంటాయని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పెగడపల్లి మండల సర్వసభ్య సమావేశం

పెగడపల్లి: మండల పరిషత్ సాధారణ సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రామ్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

12న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాలజోన్: మేడిపల్లి మండలం గోవిందారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 12న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కసనగొట్టు మనోహర్, ప్రధాన కార్యదర్శి చెన్ను వెంకటేశ్ తెలిపారు. ఆసక్తి కల క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌తో 12న ఉదయం 8 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

నేడు నేత్ర వైద్యశిబిరం

రాయికల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి ,కార్యదర్శి మోసరపు శ్రీకాంత్,కోశాధికారి గంట్యాల ప్రవీణ్ తెలిపారు.మండల ,పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ ఎంపికకు ఇంటర్వ్యూ

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సఖీ కేంద్రం/వన్ స్టాప్ సెంటర్, మహిళా శిశు వికలాంగుల,వయోవృద్ధుల శాఖ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి వాణిశ్రీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ నిర్వహణకు ఈనెల 7వరకు దరఖాస్తులు స్వీకరించామని, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఓరల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బీజేపీ మేనిఫెస్టోపై అభిప్రాయ సేకరణ

ధర్మపురి: బీజేపీ ప్రవేశపెట్టబోయే మేనిఫెస్టోపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. పట్టణంలోని నంది కూడలి వద్ద ఆదివారం సాయంత్రం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి మంచి స్పందన లభించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గొల్లపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వ పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జంగిలి ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, పెలి మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం




సమావేశమైన పూర్వ విద్యార్థులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో 2002–03 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను వేదికగా చేసుకుని ఆడుతూ పాడుతూ ప్రసంగాలతో ఆనందోత్సవాల మధ్య గడిపారు. ఒకరికొకరు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. సాయంత్రం సామూహికంగా భోజనాలు చేశారు. ఆటోగ్రాఫ్ తీసుకుని సమావేశాన్ని ముగించారు.



కోరుట్ల రూరల్: వారంతా చిన్న నాటి స్నేహితులు.. ఒకే పాఠశాలలో పదో తరగతి వరకూ చదువుకున్నారు. వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వారంతా ఓకే చోట కలుసుకున్నారు. దీనికి మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణం వేదికైంది. పట్టణంలోని శివనందిని ఉన్నత పాఠశాలలో 2004–2005 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుని ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు.

ఘనంగా బద్ది పోచమ్మ బోనాలు



బోనాలతో వస్తున్న గ్రామస్తులు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో ఆదివారం గ్రామస్తులు బద్ది పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గ్రామస్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయం పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల్లో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్‌లో ఆదివారం బద్ది పాచమ్మకు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బోరిగం వివేకవర్ధిని, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

గొల్లపల్లి/ధర్మపురి: మహా శివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గొల్లపల్లి మండలం లొత్తునూర్, ధర్మపురి మండలం నెరెళ్లలో గ్రామాల్లో ఆదివారం ఎడ్లబండ్ల పోటీలు ఘనంగా నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పుట్టపాక సత్యం, రేగొండ సత్యనారాయణ, నేరెళ్ల సాంబశివ ఆలయ కమిటీ చైర్మన్ కాసారపు రాజాగౌడ్, జాజాల రమేశ్,పొన్నం స్వామి, ఆకుల రాజు, కొప్పు తిరుపతి,చిరుత తిరుపతి, సుమన్, శేఖర్,దీక్షా స్వాములు పాల్గొన్నారు.